యాదగిరిగుట్టలో కార్తిక సందడి

- వైభవంగా వ్రత పూజలు

సామూహిక సత్యనారాయణ వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. కార్తిక మాసం రెండో శనివారం స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే మహిళలు దీపారాధనలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కొండ కింద సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తుల సందడి కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 32వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.42,42,475 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. మాఢవీధుల్లోని సంస్కృత మండపంలో హైదరాబాద్‌కు చెందిన రజని వాచస్పతి వారి భక్తి సంగీతం, నాట్యాలయ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అకాడమీ తేజస్విని వారి కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నాయి.

పెట్రోల్ బంకుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : డీఎస్‌ఓ

రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ వనజాత

ఆత్మకూరు(ఎం), నవంబర్ 9 : పెట్రోల్ బంకు నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి (డీఎస్‌ఓ) వనజాత అన్నారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ, ఇండియన్ పెట్రోల్ బంకులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కల్తీ పెట్రోల్, డీజిల్ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్‌ఓ రోజా రాణి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన హర్యానా అధికారులు

జలాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో హర్యానా అధికారులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 9 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని హర్యానా రాష్ట్ర అధికారులు శనివారం సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, సేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ శైలజ, ఏసీడీపీఓ రమ, తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్తిక మాసం ప్రత్యేక పూజలు

పెద్దమ్మ ఆలయంలో గౌరమ్మలను తయారు చేస్తున్న ఆర్యవైశ్య మహిళా విభాగ్ నాయకులు, మహిళలు

వలిగొండ, నవంబర్ 9 : కార్తిక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం ఆవరణలో ఆర్యవైశ్య మహిళా విభాగ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించారు. అనంతరం కోటి గౌరమ్మల ఉత్సవంలో భాగంగా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో గౌరమ్మల ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విభాగ్ అధ్యక్షురాలు చీకటిమల్ల వీణ, ఉపాధ్యక్షులు గజ్జెల అరుణ్ జ్యోతి, గౌరిశెట్టి మానస, ప్రధాన కార్యదర్శి బచ్చు స్వాతి, నాయకులు రజిత, పారిజాత, వసంత, అంబిక, స్వాతి, పద్మ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో గోపూజ

గోపూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 9 : పట్టణంలోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో గోపాష్టమి సందర్భంగా శనివారం గోమాతకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోగ భానుమతి, పద్మ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రుద్ర పాండు పంతులు, ప్రతినిధులు దోర్నాల కర్ణాకర్, బోగ విజయ్‌కుమార్, మిరియాల వెంకటేశం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆలేరులో వైద్య శిబిరం

సీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న ఆయుష్మాన్ షివిర్ వైద్య నిపుణులు

ఆలేరు టౌన్, నవంబర్ 9 : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం ఆయుష్మాన్ షివిర్ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్త్రీ సంబంధిత, కంటి, చర్మ, సాధారణ వ్యాధులకు సంబంధించిన విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు, వ్యాధులు సంక్రమిస్తే తీసుకోవలసిన చర్యలపై రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్నరాథోడ్, డాక్టర్లు శ్రీధర్, జుబేరియి, రహీల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

భువనగిరి అర్బన్, నవంబర్ 9 : పట్టణంలోని 13వ వార్డులో మున్సిపాలిటీ జనరల్ ఫండ్ రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ జనగాం కవితా నర్సింహాచారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వలేదని అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించవద్దు

- రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ అనితారామచంద్రన్

కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అనితారామచంద్రన్

వలిగొండ, నవంబర్ 9 : ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అలసత్వం వహించవద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. మండలంలోని మాందాపురంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, నాణ్యత ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు పంపించాలని, ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. మిల్లు యజమానులు వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోకుంటే అధికారులకు సమాచారం అందించాలన్నారు. రైతులకు బిల్లులు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించి కొనుగోళ్ల వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి, డీఏఓ గోపాల్, సివిల్ సప్లయ్ అధికారులు జగదీశ్, వనజాల, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్ముకోవద్దు : కలెక్టర్ హనుమంతరావు

గౌస్‌కొండ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 9 : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులను ఆశ్రయించి అమ్ముకోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు అధైర్య పడవద్దని, చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ధాన్యం రవాణాకు, మిల్లుల్లో ధాన్యం వెంట వెంటనే దించేందుకు ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఎస్‌ఓ కె.వనజాత, డీఎం జగదీశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు వెంకటేశ్వర్లు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఆర్ఐ గుత్త వెంకట్‌రెడ్డి, ఏపీఎం నీరజ, నాయకులు పాలొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

భువనగిరి కలెక్టరేట్ : హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సమగ్ర కుటుంబ సర్వే పూర్తి అయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2,55,713 ఇండ్లకు స్టిక్కర్ వేశారని, సర్వేలో 178 మంది అధికారులు, 1,782 మంది ఎన్యూమరేటర్లు పాల్గొన్నారని తెలిపారు. 10మంది ఎన్యూమరేటర్లకు ఒకరు చొప్పున 178 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారని వివరించారు. ఎన్యూమరేటర్లు ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం కచ్చితమైన సమాచారం సేకరించాలని, విధుల్లో అలసత్వం వహించకుండా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 9 : మండలంలోని మల్కాపురం ఇండస్ట్రియల్ పార్కు, దేవులమ్మ నాగారం, పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చౌటుప్పల్ ఏఈ రాజుల సతీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ ఫీడర్ల లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించేందుకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా వెంకటేశం

రామన్నపేట, నవంబర్ 9 : సీపీఎం మండల కార్యదర్శిగా బొడ్డుపల్లి వెంకటేశం రెండోసారి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన మండల మహాసభలో వెంకటేశంతోపాటు 21మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం మండల సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పలు తీర్మానాలు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తుర్కపల్లి, నవంబర్ 9 : మండలంలోని మాదాపురం గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ తకియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపురం గ్రామానికి చెందిన గులాన్ బాలయ్య (47) కొంత కాలంగా మద్యానికి బానిసై భార్య మమతతో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరుగడంతో మమత తన తల్లిగారింటికి వెళ్లింది. దాంతో మనస్తాపం చెందిన బాలయ్య శనివారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పంచనామా చేశారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు

రాజపేట, నవంబర్ 9 : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ నెల 11నుంచి 14 వరకు జోనల్ స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో 9 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో 13 పాఠశాలల నుంచి 1,105 మంది విద్యార్థులు పాల్గొంటారని జోనల్ ఆఫీసర్ ఎస్.విద్యారాణి, క్రీడా సమన్వయకర్త జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ బి.రాజు తెలిపారు. ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరవుతారని పేర్కొన్నారు. క్రీడల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు.

పని చేయని పరికరంతో తేమ ఎలా చూస్తారు

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి
- సంబంధిత అధికారులపై ఆగ్రహం

ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), నవంబర్ 9 : పని చేయని పరికరాలతో ధాన్యం తేమ శాతం ఎలా పరిశీలిస్తారని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ప్రశ్నించారు. ఆ పరికరాలను పంపిణీ చేసిన సంబంధిత అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటలోపు పని చేసే పరికరాలను ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉంచాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించగా అన్ని రాశులవి 18 చూపించగా అదనపు కలెక్టర్ అవాక్కయ్యారు. వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మరో పరికరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆయన వెంట సివిల్ సప్లయ్ జిల్లా అధికారి జగదీశ్, డీఎస్‌ఓ వనజాత, ఎస్‌ఓ రోజారాణి, తాసీల్దార్ రవికుమార్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, ఏఓ అరుణకుమారి, ఏఈఓ మనీషా, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అరుణ, సంధ్య ఉన్నారు.

ఓటరు జాబితాలో యువత పేరు నమోదు చేసుకోవాలి

- భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి

బీబీనగర్ తాసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

బీబీనగర్, నవంబర్ 9 : ప్రత్యేక ఓటరు జాబితాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ పేరు నమోదు చేసుకోవాలని భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. తాసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి ఓటరు నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఆదివారం పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎం.శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను, ఓటర్ల జాబితాను తాసీల్దార్ రవికుమార్ శనివారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో 18సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఫారం - 6 ద్వారా ఓటు కల్పించాలన్నారు. ఎవరైనా మృతిచెందితే వారి కుటుంబ సభ్యుల ద్వారా ఫారం -7 దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ మల్లికార్జున్‌రావు, బీఎల్‌ఓలు ధనమ్మ, శ్రీవాణి, సరిత పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాలను తాసీల్దార్ అంజిరెడ్డి పరిశీలించారు. 2025 జనవరి 1 వరకు 18ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణచందర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి : ఆర్డీఓ

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 9 : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని అనాజీపురంలో చేపడుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సర్వే చేపట్టాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ దినకర్‌గౌడ్, ఎన్యూమరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

ప్రతిఘటన పోరాట మార్గదర్శకుడు చంద్రపుల్లారెడ్డి

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు జనార్దన్, భిక్షపతి

ఆలేరు : చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జనార్దన్

ఆలేరు టౌన్, నవంబర్ 9 : చంద్ర పుల్లారెడ్డి నూతన ప్రజాస్వామిక విప్లవ, ప్రతిఘటన పోరాట మార్గదర్శకుడు అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు ఆర్.జనార్ధన్, ఎం.భిక్షపతి అన్నారు. పట్టణంలో పార్టీ నాయకుడు బేజాడి కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సభలో వారు మాట్లాడారు. దున్నేవాడికే భూమి నినాదం సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. చంద్ర పుల్లారెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని పార్టీ శ్రేణులు, ప్రజలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతకుముందు చంద్ర పుల్లారెడ్డితోపాటు అమరవీరులకు జోహార్లు అర్పించారు. సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, నాయకులు రాజయ్య, పద్మ, నాగరాజు, సిద్దేశ్వర్, ఉదయ్, సోమ య్య, పాండరి పాల్గొన్నారు.

పుల్లారెడ్డి చిత్రపటానికి నివాళి

భూదాన్ పోచంపల్లి : చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలో శనివారం ఆయన చిత్రపటానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు నివాళులర్పించారు. పుల్లారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పగడాల శివ, మోహన్‌రావు, నగేశ్, రాజేందర్, సతీశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన రాజు

భువనగిరి అర్బన్, నవంబర్ 9 : భువనగిరి పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సూదగాని రాజు జన్మదినం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌కు రాజు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు పొందారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజు

మూసీ పాదయాత్ర కాదు.. కల్లాల్లో యాత్ర చేయండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రేవణపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : మూసీకి ఏమిచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. రెండు నెలలు అవుతున్నా ధాన్యం ఎందుకు కొనుగోలు చేయలేదని, యాత్ర ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చేయాలని హితవు పలికారు. శనివారం భూదాన్ పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ, రేవణపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి మీడియాతో మాట్లాడారు. రైతులు చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా.. మూసీ ప్రక్షాళన పేరుతో సీఎం బోటు షికారు చేస్తున్నారని విమర్శించారు. కల్లాల్లోకి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. రైతులంటే రేవంత్‌రెడ్డికి చిన్నచూపు అని విమర్శించారు. రైతుల పాలిట కాంగ్రెస్ భస్మాసుర హస్తంగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిసెంబర్ 9లోగా రుణాలన్నీ మాఫీ చేస్తాం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రామన్నపేట, నవంబర్ 9 : డిసెంబర్ 9లోగా రూ.2లక్షల్లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని, ఇప్పటికే 22లక్షల మందికి రుణమాఫీ చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్ల ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుందన్నారు. రైతు భరోసా డబ్బులను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. రైతులకు ఉపయోగపడే కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామన్నారు. కొత్తగా రామన్నపేట వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చేనేత కుటుంబాల రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, చేనేత సంఘాల పెండింగ్ నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, మండల అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే వీరేశం మంత్రిని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, డీఏఓ డి.గోపాల్, డీసీఓ ఎన్.శ్రీధర్, డీసీసీబీ సీఈఓ ఎం.శంకర్‌రావు, పీఏసీఎస్ సీఈఓ జంగారెడ్డి, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మత్స్యగిరి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మత్స్యగిరి ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌బాబు

వలిగొండ, నవంబర్ 9 : మండలంలోని వెంకటాపురంలో గల మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 15వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌బాబు తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనర్సు

మోత్కూరు, నవంబర్ 9 : చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో శనివారం జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన చేనేత త్రిఫ్ట్, నూలుపై సబ్సిడీ వంటి పథకాల వల్ల కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోగా, ఉన్న పాత పథకాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో సంఘం చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి రాములు, నాయకులు పసునూరి యాదగిరి, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

నీరా కేంద్రం పూర్తిచేసి ప్రారంభించాలి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ


నందనంలో నీరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కల్లు గీత కార్మిక సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 9 : మండలంలోని నందనం గ్రామంలో నీరా ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. నీరా కేంద్రం పనులను సంఘం నాయకులతో కలిసి శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నీరా కేంద్రానికి గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి రూ.8కోట్ల బడ్జెట్ కేటాయించినా ఇప్పటి వరకూ పనులు పూర్తి చేయలేదన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం, మిషనరీ పడావు పడి నిరుపయోగంగా మారాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకొని నీరా కేంద్రానికి అవసరమయ్యే నిధులు కేటాయించి కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నీరా కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంత గీత కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే జోక్యం చేసుకొని పనులు పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు, వి.వెంకటనర్సయ్య, స్థానిక సొసైటీ అధ్యక్షుడు బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.